క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: ఆపదలో ఉన్నవారిని సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఆదుకుంటోందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. మండలంలోని మల్లంపూడికి చెందిన సంగుల తమ్మారావు ఇటీవల హైదరాబాద్‌లో కిడ్నీ ప్లాంటేషన్ చేయించుకున్నాడు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ద్వారా ప్రభుత్వ సాయాన్ని కోరడంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.4.50 లక్షలు మంజూరు చేశారు. దీనికి సంబంధించిన చెక్కును రాజమహేంద్రవరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో తమ్మారావుకు విజయలక్ష్మి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దొర పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన డీవైఈవో



బిక్కవోలు ఉన్నత పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీవైఈవో తిరుమలదాసు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు ఉన్నత పాఠశాలను డీవైఈవో ఎం.తిరుమలదాసు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి స్కూలు రికార్డులను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందజేసిన జగనన్న కిట్ల గురించి ఆరా తీశారు. బూట్ల సైజు సరిపోతుందా లేదా అంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా నాణ్యత లేని బ్యాగులు వస్తే వాటి స్థానంలో కొత్తవి పంపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు పడాల సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోలను కలిసిన ఎస్టీయూ సభ్యులు



ఎంఈవోలను సత్కరిస్తున్న ఎస్టీయూ సంఘ సభ్యులు

బిక్కవోలు: స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఇటీవలే ఎంఈవో–2గా బాధ్యతలు స్వీకరించిన పూర్ణచంద్రరావును ఎస్టీయూ సంఘ సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎంఈవో–1 కె.శ్రీనివాసరావు, ఎంఈవో–2 పూర్ణచంద్రరావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ అధ్యక్షుడు లచ్చిరెడ్డి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కాలుకురచ సత్యనారాయణ, ఆర్థిక కార్యదర్శి ద్వారంపూడి సురేంద్రరెడ్డి, జంగా శ్రీనివాస్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయకు ఎంపిక



రత్నవల్లిక

సీతానగరం: మండలంలోని రఘుదేవపురానికి చెందిన జొన్నకుట్టి రత్నవల్లిక నవోదయకు ఎంపికైంది. రఘుదేవపురం ఎస్సీ కాలనీలోని ఎంపీపీ స్కూల్లో ఐదో తరగతి చదివిన రత్నవల్లిక నవోదయ ప్రవేశ పరీక్ష రాయగా, ఎటపాకలో సీటు వచ్చింది. వ్యవసాయ కూలీలైన తల్లిదండ్రులు పోశియ్య, పోశమ్మలు తన కుమార్తె నవోదయకు ఎంపిక కావడంపై సంతోషం వ్యక్త చేశారు. స్కూలు ప్రధానోపాధ్యాయులు పి.నాగప్రభకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ విద్యార్థినిని ఎంఈవో కె.స్వామినాయక్, హెచ్ఎం నాగప్రభ అభినందించారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవు



మైనర్లు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వాసు

పెదపూడి: మైనర్లు వాహనాలు నడిపితే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పెదపూడి ఎస్ఐ పి.వాసు హెచ్చరించారు. గురువారం ఆయన పెదపూడి మార్కెట్ సెంటర్లో నిర్వహించిన వాహన తనిఖీల్లో భాగంగా వాహనాలు నడుపుతున్న మైనర్లను ఆపి, వారి తల్లిదండ్రుల్ని పిలిపించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వాసు మాట్లాడుతూ నిర్ణీత వయసు, లైసెన్సు కలిగిన వారే వాహనాలు నడపాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని చెప్పారు.

పరిమితి దాటితే ప్రమాదమే..

- పురుగుమందుల పిచికారీపై అవగాహన అవసరం
- ఎక్కువైతే మిత్రపురుగులూ నాశనం
- రైతులకు పంట నష్టం



పంటలపై పురుగు మందును పిచికారీ చేస్తున్న రైతు

రాజానగరం: పంటలను నాశనం చేసే చీడపీడలను నివారించడం ఎంత ముఖ్యమో, అదే సమయంలో పంటలకు మేలు చేకూర్చే మిత్ర పురుగులను కాపాడుకోవడం అంతే అవసరం. ప్రస్తుతం చాలామంది రైతులు అధిక దిగుబడుల కోసం చీడపీడల నివారణకు ఇష్టానుసారంగా పురుగు మందులను పంటలపై పిచికారీ చేయడం వల్ల మిత్ర పురుగులు కూడా నాశనమైపోతున్నాయి. ఈ కారణంగా శత్రు పురుగుల ఉధృతి పెరిగి, రైతులు పంటనష్టాలను కూడా చూస్తున్నారు. మిత్ర పురుగులకు హాని కలిగించని విధంగా, అవసరం మేరకు క్రిమిసంహారక మందులను వాడడం ఎంతో మంచిదని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు.

పరిమితి మేరకే..

జిల్లాలో మెట్ట ప్రాంతంగా పేరొందిన రాజానగరం మండలంలో సుమారు 6,250 హెక్టార్లలో వరి పంటను సాగు చేస్తుంటారు. బోర్లు ఉన్న రైతులు ఖరీఫ్ సాగు కోసం ఇప్పటికే వరినార్లు వేసే పనిలో నిమగ్నమైఉండగా, మిగిలిన వారు వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తున్నారు. విత్తు చల్లిన నాటి నుంచే క్రిమిసంహారక మందులను వాడుతున్న నేపథ్యంలో మిత్ర పురుగుల సంరక్షణను కూడా దృష్టిలో పెట్టుకుని, పరిమితి మేరకు అవగాహనతో క్రిమి సంహారక మందులను వాడాలని వ్యవసాయ అధికారులు రైతులను చైతన్యపరుస్తున్నారు.

మిత్రపురుగులతో ఎన్నో లాభాలు

పచ్చపురుగు, లద్దె పురుగులు పంటలపై పెట్టిన గుడ్ల నుంచి వచ్చే సంతతిని సాలీడు పురుగు ఎప్పటికప్పుడు తినేస్తూ, వాటి ఉధృతిని నివారిస్తుంటుంది. అలాగే చీడ పురుగులు పంటలపై పెట్టిన గుడ్లను తూనీగలు తినడమే కాకుండా పరపరాగ సంపర్కం జరగడానికి చాలా తోడ్పడతాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తూనీగ ఒక మొక్క పైనుంచి మరో మొక్క పైకి వాలినప్పుడు మగ పుష్పంలో ఉన్న పుప్పొడి రేణువులను ఆడ పుష్పం పైన వదలడం వలన ఫలదీకరణం జరిగి పిండం, తరువాత విత్తనం, ఆ తరువాత పంట మంచి దిగుబడులకు తోడ్పడుతుందన్నారు. వీటితో పాటు కందిరీగ, మిడత, పాడిసన్‌టగ్ వంటి మిత్ర పురుగులు సైతం పంటను ఆశించే చీడ పురుగుల గుడ్లను ఎప్పటికప్పుడు తినేస్తూ వాటి సంతతి పెరగకుండా నిరోధిస్తాయి. ఇలా రైతుకు ఖర్చు లేకుండా పంటలను ఆశించే చీడ పీడలను నివారించడంలో మిత్ర పురుగులు రైతాంగానికి మేలు చేస్తున్నాయి. అయితే కొంతమంది రైతులు చూపే నిర్లక్ష్యం, అవగాహన లోపాల కారణంగా మోతాదుకు మించి క్రిమి సంహారక మందులు వాడటంతో మిత్ర పురుగులు కూడా నశించిపోతున్నాయి.

అవగాహన అవసరం



పంటలను ఆశించే చీడపీడలను నివారించడంలో భాగంగా రైతులు వాడే క్రిమి సంహారక మందుల విషయంలో పూర్తి అవగాహన అవసరం. ఇష్టానుసారంగా వాడతే అనర్థాలు జరుగుతాయి. పంటపై ఒకటి, రెండు చీడలు కనిపించినంత మాత్రాన వెంటనే పురుగు మందులు పిచికారీ చేయాల్సిన పనిలేదు. పర్యావరణం/మిత్ర పురుగుల ద్వారా అటువంటివి నశిస్తాయనే విషయాన్ని గ్రహించాలి. మిత్ర పురుగులను కాపాడుకోవడం వల్ల ఖర్చును ఆదా చేయడంతోపాటు భూమికి మేలు చేకూర్చిన వారవుతారు.

– కె.సూర్యరమేష్, వ్యవసాయాధికారి, సీతానగరం

వేపకాయలదిబ్బలో విద్యుత్ సబ్‌స్టేషన్



అమరావతిలో మంత్రి రామచంద్రారెడ్డిని కలిసిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



మంత్రి విడదల రజనీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజా

- మంజూరు చేసిన మంత్రి పెద్దిరెడ్డి
- ఎమ్మెల్యే రాజా వినతిపై సానుకూల స్పందన

సీతానగరం: రాజానగరం మండలం దివాన్ చెరువు పంచాయతీలోని వేపకాయలదిబ్బలో కొత్తగా 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైంది. గురువారం అమరావతి వెళ్లిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు విషయమై చర్చించారు. దీంతో సబ్‌స్టేషన్ మంజూరు చేస్తున్నట్టు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఏపీ ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో దీని నిర్మాణం జరగనుంది. కాగా.. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అమరావతిలో పలువురు మంత్రులను కలిశారు. సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)గా మార్పు చేస్తూ ఇటీవల రాష్ట్ర కేబినెట్ సమావేశంలో నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనీని ఎమ్మెల్యే రాజా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజాను కలుసుకున్నారు. న్యూడెవలప్‌మెంట్ బ్యాంకు (ఎన్‌డీబీ) నిధులతో నియోజకవర్గంలో జరుగుతున్న వివిధ రోడ్ల నిర్మాణ పనులు నెమ్మదించాయని మంత్రికి నివేదించారు. వాటిని వేగవంతం చేసేలా అధికారులను ఆదేశించాలని కోరారు.

కోరుకొండ భూములకు రిజిస్ట్రేషన్ కల్పించండి



కలెక్టర్ మాధవీలతకు వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మధురపూడి: కోరుకొండలోని భూములకు రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించాలని వైఎస్సార్ సీపీ నాయకులు, భూపోరాట సమితి నాయకులు గురువారం కలెక్టర్ మాధవీలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ భూములకు రిజిస్ట్రేషన్ హక్కు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. వివాహాలు, శుభ కార్యక్రమాలు, ఇతర అవసరాలకు ఆస్తులను విక్రయించుకునే అవకాశం లేదన్నారు. దీంతో సొంత స్థలం ఉన్నప్పటికీ అప్పుల పాలవుతున్నట్టు వాపోయారు. వివరాల్లోకి వెళితే.. కోరుకొండలో కొలువుదీరిన లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన భూములు కోరుకొండ తదితర గ్రామాల్లో ఉన్నాయి. వీటి రిజిస్ట్రేషన్ కోసం కోరుకొండ వాసులు పలు ఉద్యమాలు నిర్వహించారు. ఈ సమస్య పరిష్కారానికి ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ప్రయత్నాలు చేస్తున్నారు. దానిలో భాగంగా కొంత భూమికి రిజిస్ట్రేషన్ అవకాశం వచ్చింది. ఇదిలా ఉండగా కోరుకొండలోని భూములకు రిజిస్ట్రేషన్ కల్పించాలన్న డిమాండ్ మేరకు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆదేశాల్లో భాగంగా ఈ వినతిపత్రాన్ని అందజేశారు. దీనికి కలెక్టర్ మాధవీలత సానుకూలంగా స్పందించారు. ఆమెను కలిసిన వారిలో భూ పోరాట సమితి నాయకుడు డాక్టర్ కుంచే వెంకటరమణ, గ్రామ ఉప సర్పంచ్ నేతుల చిన్ని, ఎంపీటీసీ కాళ్ల వీరబాబు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు అయిల రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి, వాకా నరసింహారావు, బొరుసు బద్రి, బొడ్డుపల్లి శివ ఉన్నారు.

నాలుగు నుంచి జగనన్న సురక్ష క్యాంపులు

అనపర్తి: సాంకేతిక కారణాల వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందని అర్హులకు ప్రభుత్వ సేవలకు సంబంధించిన అవసరమైన పత్రాలు మంజూరు చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి నాంది పలికింది. దీంట్లో భాగంగా జులై 4 నుంచి 28వ తేదీ వరకూ మండల స్థాయి అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామ సచివాలయాల్లో నిర్వహించే శిబిరాల్లో దరఖాస్తు చేసుకున్న వారికి సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌లో ప్రజా సమస్యలు అప్‌లోడ్ చేయడంతో పాటు సచివాలయంలో దరఖాస్తులు ఆన్‌లైన్ చేసి దరఖాస్తుదారుకు టోకెన్ ఇవ్వనున్నారు. ముఖ్యంగా కుల, ఆదాయ, నివాస, మరణ, జనన, వివాహ, ఫ్యామిలీ తదితర ధ్రువీకరణ పత్రాల జారీ తదితర అంశాలకు ప్రాధాన్యమిస్తారు.

అనపర్తి మండలంలో రెండు బృందాలు

జగనన్న కార్యక్రమం నిర్వహణకు సంబంధించి మండల పరిధిలో రెండు బృందాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ కె.హిమ మహేశ్వరి తెలిపారు. ఎంపీడీఓతో పాటు డిప్యూటీ తహసీల్దార్ కె.శేఖర్, మండల ప్రజా పరిషత్ జూనియర్ అసిస్టెంట్ యు.రవితేజలు ఒక బృందంగా(టీం–1), తహసీల్దార్ వై.సరస్వతి, ఈవోపీఆర్డీ కేయూఆర్ఎల్ పద్మజ, ఆర్ఐ వై.దయామణి మరో బృందంగా(టీం–2) ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సీతానగరం మండలంలో..

సీతానగరం: మండలంలో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమాల షెడ్యూల్‌ను విడుదల చేశామని ఎంపీడీవో కె.రమేష్, తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు తెలిపారు. ఈ మేరకు గురువారం విలేకరులతో మాట్లాడారు. వలంటీర్ల ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, ఆయా గ్రామ సచివాలయాల్లో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామన్నారు. జూలై ఒకటిన కూనవరం, పురుషోత్తపట్నం, 4న ముగ్గళ్ల, వంగలపూడి, 6న ఇనుగంటివారిపేట, సింగవరం, 7న మునికూడలి, సీతానగరం–1, 11న కాటవరం, సీతానగరం–2, 13న మిర్తిపాడు, చినకొండేపూడి–1, 14న ఉండేశ్వరపురం, చినకొండేపూడి–2, 18న బొబ్బిల్లంక–1, రఘుదేవపురం–1, 20న బొబ్బిల్లంక–2, రఘుదేవపురం–2, 21న రఘుదేవపురం–3, నాగంపల్లిల్లోని గ్రామ సచివాలయాల్లో జరుగుతాయన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజానగరం: నందరడాలోని విద్యుత్ సబ్‌స్టేషన్, లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు 11 కేవీ ఫీడర్లకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. నందరాడ, నరేంద్రపురం, వెలుగుబంద గ్రామాలకు పైసమయంలో విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

డిజిటల్ బోధనపై అవగాహన అవసరం



డిజిటల్ పాఠాలు బోధిస్తున్న డీఈఓ అబ్రహం

రాజానగరం: విద్యార్థులకు డిజిటల్ విధానంలో పాఠాలు బోధించే విధానంపై ఉపాధ్యాయులు పూర్తి అవగాహన పెంచుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించిన ఆయన బ్లాక్ బోర్డు, గ్రీన్ బోర్డులతో అవసరం లేకుండా స్మార్ట్ టీవీపైనే ప్రత్యేక పెన్‌తో అక్షరాలు రాస్తూ, డిజిటల్ విధానంలో పాఠాలు బోధించారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ విధానంలో విద్యను బోధించడం హర్షణీయమన్నారు. ఈ విధానంలో విద్యార్థులకు తలెత్తే వివిధ సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసేలా పూర్తి అవగాహనను పెంచుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ విధానాన్ని పరిశీలించారు.

విద్యాభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి



విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సత్కరించిన పేరెంట్స్ కమిటీ చైర్మన్ గొలుగూరి నాగిరెడ్డి తదితరులు

బిక్కవోలు: విద్యాభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని, అందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యకు పెద్దపీట వేస్తున్నారని పేరెంట్స్ కమిటీ చైర్మన్ గొలుగూరి నాగిరెడ్డి అన్నారు. పందలపాకలోని పడాల పెదపుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద గురువారం నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో ఆయన పాల్గొని పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. పాఠశాలలో ప్రథమ స్థానం సాధించిన మాడెం దినేష్ వెంకట గణేష్‌కుమార్‌కు రూ.3 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన పిల్లా మేఘన వెంకటదుర్గకు రూ.2 వేలు, తృతీయ స్థానం సాధించిన బేతా దినేష్‌రాజుకు రూ.వెయ్యి నగదు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు తాడి కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ రొంగల అప్పాజీ, వైఎస్సార్ సీపీ మండల జేఏసీ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, మండపేట ఎంఈవో–2 చింతా వెంకట సోమిరెడ్డి, సచివాలయం కన్వీనర్ పాలచర్ల అబ్బులు, పాఠశాల శాశ్వత కమిటీ సభ్యులు తాతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భవన నిర్మాణానికి స్థలం కేటాయింపు



స్థల కేటాయింపు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: అనపర్తిలో పద్మశాలి సంఘం సామాజిక భవన నిర్మాణానికి ఐదు సెంట్ల పంచాయతీ స్థలాన్ని కేటాయించారు. స్థల కేటాయింపు పత్రాలను అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి చేతుల మీదుగా గురువారం పద్మశాలి సంఘీయులకు అందజేశారు. ఈ సందర్భంగా అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ అనపర్తిలో ముగ్గురు ఎంపీటీసీలుగా పద్మశాలీలకు అవకాశం కల్పించడం ద్వారా ఆ సామాజిక వర్గానికి గుర్తింపునిచ్చామన్నారు. అలాగే నామినేటెడ్ పదవుల్లో కూడా అవకాశం కల్పించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఐదు సెంట్ల స్థలాన్ని కేటాయించిన ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయయణరెడ్డిని పద్మశాలీ సంఘం నేతలు, సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి, వైస్ ఎంపీపీ కర్రి దాసు, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు కొండేటి భీమేష్, తుమ్మ రాజేశ్వరి, బండారు శ్రీనివాసరావు, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టరు సత్తి రామకృష్ణారెడ్డి(రాంబాబు), వైఎస్సార్‌సీపీ అనపర్తి టౌన్ శాఖ అధ్యక్షులు నల్లమిల్లి మురళీమోహనబాలకృష్ణారెడ్డి, రాష్ట్ర సేవాదళ విభాగం కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల చేనేత విభాగం కన్వీనర్ పెనుగొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం



తంటికొండలో విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని సచివాలయాల మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు అన్నారు. మండలంలోని తంటికొండ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి చేస్తున్న కృషి ఫలితంగా ఈ ఏడాది పదో తరగతిలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, బద్దిరెడ్డి అప్పన్నదొర, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బద్దిరెడ్డి నాగవెంకటేశ్వరరావు, పీఎంసీ చైర్మన్ బద్దిరెడ్డి దామోదర్, బద్దిరెడ్డి సుబ్బారాయుడు, బద్దిరెడ్డి నాగసూర్యసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల ఫలితంగానే సత్రం భూములకు కౌలు వేలం

గోకవరం: రంపయర్రంపాలెంలో సుందరమ్మ సత్రం భూములపై ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం చేసిన పోరాటాల ఫలితంగానే అధికారులు ఆ భూములకు కౌలు వేలం నిర్వహిస్తున్నారని రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. మండలంలోని రంపయర్రంపాలెంలో గురువారం ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా సత్రం భూములను పలువురు తమ ఆధీనంలో ఉంచుకుని అనుభవిస్తున్నారన్నారు. దీనిపై రెండు దశాబ్దాలుగా రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో అలుపెరగని పోరాటం చేశామన్నారు. దీని ఫలితంగా ఈ నెల 27న భూములకు కౌలు వేలం నిర్వహిస్తామని అధికారులు ప్రకటించారన్నారు. ఈ వేలం పాటల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

డ్రగ్స్ నివారణపై అవగాహన ర్యాలీ



గోకవరంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఎస్ఈబీ సిబ్బంది

గోకవరం: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరుకొండ ఎస్ఈబీ ఎస్సై సత్యనారాయణ సూచించారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా గురువారం గోకవరం కేవీఎస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదని, చదువుకుని మంచి ఉన్నత స్థానాల్లో ఉండాలన్నారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్టు సమాచారం ఉంటే తమకు సమాచారం అందించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ప్రజావేదిక

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉపాధి హామీ సోషల్ ఆడిట్ – ప్రజావేదిక సదస్సు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పీఎస్ నరేష్ కుమార్ తెలిపారు. ఈ ఏమేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. ఈనెల 13 నుంచి 23 వరకూ గ్రామాల వారీగా సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి కూలీలు హాజరు కావాలని కోరారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలను విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సెబ్ సీఐ వెంకటలక్ష్మి

రంగంపేట: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) సీఐ జి.వెంకటలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ మాదక ద్రవ్యాల ప్రభావంతో యువత మత్తుకు బానిసలై తమ బంగారు భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారన్నారు. యువత జీవితంలో లక్ష్యం ఏర్పరచుకుని దాని సాధనకు కృషి చేయాలని చెప్పారు. మత్తు మరియు మాదక ద్రవ్యాల సమాచారాన్ని 14500 అనే టోల్ ఫ్రీ నంబరుకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కాపవరంలో గడప గడపకూ..

బిక్కవోలు: మండలంలోని కాపవరంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

సీతానగరం: విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పలివెల వీరబాబు అన్నారు. ఈ మేరకు గురువారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పెంచిన విద్యుత్ చార్జీలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారం పడుతోందన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బిక్కవోలు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం అనపర్తికి చెందిన బండారు రవి(46) తెనాలి స్టీల్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇటీవలే బలభద్రపురంలోని కుమార్తె ఇంటికి వచ్చిన ఆయన ఈ నెల 18వ తేదీన ద్విచక్రవాహనంపై వెళుతుండగా బలభద్రపురంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాలపాలైన రవిని అనపర్తి సీహెచ్‌సీకి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపారు.

గోకవరం తహసీల్దార్‌గా సుగుణ



గోకవరం: మండల తహసీల్దార్‌గా డి.సుగుణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆమె కిర్లంపూడి, ప్రత్తిపాడు మండలాల ఎంఎస్ఓగా బాధ్యతలు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. రెవెన్యూ సిబ్బంది, మండలంలోని పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు ఆమెకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలు అందిస్తానన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా చర్యలు



కాపవరం రామకోవెల సెంటర్‌లో పనులు చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

మధురపూడి: వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిరాటంకంగా జరిగేందుకు చర్యలు చేపట్టినట్టు ఈపీడీసీఎల్ ఏఈ మదర్షా తెలిపారు. ఇందులో భాగంగా కోరుకొండ మండలం కాపవరం రామకోవెల తదితర కూడళ్లలో మరమ్మతులకు గురైన స్తంభాల స్థానంలో నూతన స్తంభాలను ఏర్పాటు చేశామన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో కూడా ఈ పనులు జరుగుతున్నాయని తెలిపారు.

పీహెచ్‌సీ తనిఖీ



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజానగరం: స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, అక్కడ ఉన్న రోగులను ఆస్పత్రి సిబ్బంది పనితీరుపై ప్రశ్నించారు. అనంతరం చక్రద్వారబంధంలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి, వాటి పనితీరు గురించి ఆరా తీశారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ టి.రవికుమార్, ఈ.సంజీవని, వైద్య సిబ్బంది ఉన్నారు.